సాక్షి
జోగుళాంబ గద్వాల
గురువారం, 2, జనవరి, 2025



దారి తప్పిన 'భద్రత'

అతివేగం, నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి జిల్లాలో రోడ్డు 'భద్రత' దారి తప్పుతోంది.

వివరాలు 8లో ▸



నెట్‌బాల్ పోటీలు

రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /15.4

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సత్వర న్యాయ సేవలకు కృషి



అలంపూర్: పేదలకు సత్వర **న్యాయ సేవలు** అందించడానికి న్యాయవాదులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అలంపూర్ కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ మిథున్ తేజను అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం శుభకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్, ఏజీపీ మధు, మాజీ ఏజీపీ నరసింహ్మ, న్యాయవాదులు రాజేశ్వరి, శ్రీధర్ రెడ్డి, ఈదుర్ బాష, అఫ్రోజ్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మన్యంకొండకు పాదయాత్ర



స్టేషన్ మహబూబ్‌నగర్: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం మన్యంకొండకు మహాపాదయాత్ర చేపట్టారు. జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర బండమీదిపల్లి, ధర్మాపూర్ మీదుగా మన్యంకొండ దేవస్థానం వరకు నిర్వహించారు. వందలాది మంది భక్తులు గోవిందనామ, హరినామ సంకీర్తనలతో పాదయాత్ర చేపట్టారు. అనంతరం భక్తులు మన్యంకొండ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వాసవీ ఆలయ ప్రధాన అర్చకులు గొంద్యాల రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ ఇలాంటి యాత్రలు చేయడం వల్ల హిందువుల్లో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. భక్తిమార్గం దిశగా యువతను నడిపించడానికి ఇలాంటివి ఉపయోగపడుతాయని అన్నారు. ధనుర్మాసంలో విష్ణు క్షేత్రాన్ని దర్శించుకోవడం మోక్షదాయకమన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు నాయిని భాగన్నగౌడ్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండ వెంకటేశ్వర్లు, మిర్యాల వేణుగోపాల్, కోశాధికారి తల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో భీమా కోరేగావ్ శౌర్య దివాస్ 207వ దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మాల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవ పోరాట విజయమే భీమా కోరేగావ్ అని అన్నారు. 1818లో మహార్ బెటాలియన్ సైనికులు చేసిన వీరోచిత పోరాటానికి గుర్తుచేస్తూ భీమా కోరేగావ్ దివాస్ జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, ఎడ్ల కృష్ణయ్య, ఎం.బాలరాజు, చెన్నయ్య, యాదయ్య, రాములు, శ్రీనివాసులు, గోకం చెన్నయ్య, వెంకట్రాములు పాల్గొన్నారు. సిద్దునాగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కందికి దక్కని గిట్టుబాటు



గద్వాల యార్డులో విక్రయానికి వచ్చిన కంది

- ఆరంభంలో రూ.9,500 పైచిలుకు ధర
- ఆతర్వాత రూ.7500 దాటని వైనం
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- జిల్లాలో 41,235 ఎకరాల్లో కంది సాగు

గద్వాల వ్యవసాయం: కంది సాగు చేసిన రైతులు ఈ ఏడాది సైతం నిరాశ చెందే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గడిచిన ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలతో పంట దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆర్థికంగా నష్టాలు చవిచూశారు. ఈఏడాది కంది పంటకు పూత, గింజ దశలో చీడపీడలు ఆశించి పంటపై ప్రభావాన్ని చూపి, దిగుబడులు కొంత తగ్గినా, ధరలు వస్తాయన్న రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి.

నడిగడ్డలో కంది సాగు

ఆహార పంట అయిన కంది పప్పుకు మార్కెట్‌లో ఎప్పుడు డిమాండ్‌తో మంచి ధరలు ఉంటాయి. కంది పంటను ఈప్రాంత రైతులు అధికంగా సాగు చేస్తారు. వర్షాలు కొంత మేర వచ్చినా.. చలితో పంట బాగా వస్తుందని సాగు చేస్తుంటారు. దీనికితోడు పంటలో కొంత తినడానికి మిగుల్చుకొని, మిగిలినది విక్రయిస్తుంటారు. బోర్లు, బావులు ఉన్న రైతులతో పాటు, నీటి లభ్యత లేని రైతులు సైతం ఏటా వానాకాలం సీజన్‌లో కందిని వేస్తారు. కంది పంట సాగు చేయడానికి ఎకరాకు రూ.18వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు వస్తుంది. ఆరు నెలలు పంట కాలం. వాతావరణం సహకరిస్తే నీటి లభ్యత ఉన్న చోట 8నుంచి 10 క్వింటాళ్ళు, వర్షాధారం కింద అయితే ఎకరాకు 3నుంచి 5 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుంది.

గతేడాది నష్టం

గడిచిన వానాకాలం సీజన్‌లో కంది పంటను 22,503 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఇందులో వర్షాధారం కింద, నీటి లభ్యత ఉన్న రెండు చోట్ల వేశారు. వర్షాలు ఆశించి స్థాయిలో కురవలేదు. ఫలితంగా వర్షాధారం కింద ఎకరాకు 3నుంచి 5 క్వింటాళ్ల రావాల్సి ఉండగా, కేవలం రెండు నుంచి రెండున్నర క్వింటాళ్లు, నీటి లభ్యత ఉన్న చోట 8నుంచి 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 5 నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీంతో రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారు.

తగ్గిన దిగుబడులు

ఈఏడాది గంపెడు ఆశలతో కంది సాగు చేపట్టారు. వర్షాలు బాగా కురుస్తాయన్న అంచనాతో గడిచిన ఏడాది కన్నా రెట్టింపుగా వర్షాధారం, నీటి లభ్యత కింద 41,235 ఎకరాల్లో కంది సాగు చేశారు. రైతులు ఆశించిన విధంగానే వర్షాలు బాగా వచ్చాయి. అయితే అక్టోబర్‌లో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పాటు, పూత దశలో ముసురు వర్షాలు రావడం వల్ల పూతకు తెగుళ్ళు, నల్లి, దోమ ఆశించాయి. గింజ దశలో కాయతొలుచు, పచ్చ పురుగులు విపరీతంగా ఆశించాయి. ఫలితంగా పంట దిగుబడులు తగ్గాయి.. వర్షాధారం కింద ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు, నీటి లభ్యత ఉన్న చోట 6 నుంచి 8 క్వింటాళ్లు వచ్చింది.

మద్దతు కరువు

చేతికి వచ్చిన కంది పంట ఉత్పత్తులను విక్రయించడానికి డిసెంబర్ మొదటి వారం నుంచి రైతులు యార్డుకు తీసుకువస్తున్నారు. ఆరంభంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.9500 పైచిలుకు వచ్చింది. దీంతో రైతులు కొంత సంతోషించారు. అయితే ఆసంతోషం వారం రోజుల్లోనే మాయం అయ్యింది. మార్కెట్ మాయజాలమో.. మరేమో కాని ఒక్క సారిగా ధరలు తగ్గాయి. వారం తర్వాత క్వింటాలుకు రూ.8500 కు చేరింది. మరో వారంకు రూ. 7600 నుంచి రూ. 7300కు వచ్చింది. దీంతో కంది రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈఏడాది అటు దిగుబడులు తగ్గి, ఇటు ధరలు తగ్గి ఆర్థికంగా నష్టాల పాలు అవుతున్నామని అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ. 150 నుంచి 180 వరకు ఉంది. ఈలెక్కన క్వింటాలుకు రూ. 9500 నుంచి రూ. 10వేల వరకు రావాలి. కాని రైతులకు మాత్రం ఆ ధరలు లభించడం లేదు. ఇదిలా ఉంటే కంది ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7550 ఉంది. మూడేళ్ళ క్రితం వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇప్పుడు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదర ఇచ్చినా రైతులకు గిట్టుబాటు కాదు. చేసేది లేక గడిచిన వారం రోజుల నుంచి ఈప్రాంత రైతులు రాయచూర్ మార్కెట్‌కు తీసుకెళ్ళి విక్రయిస్తున్నారు. అక్కడ క్వింటాలుకు రూ. 8వేల నుంచి రూ.8200 వరకు వస్తోంది. కాగా పెరిగిన పెట్టుబడుల ప్రకారం క్వింటాకు 9500 నుంచి రూ. 10వేలు వస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. మార్కెట్ మాయాజాలంలో వ్యాపారులు రైతులను పావులుగా వాడుకుంటు, పంట ఉత్పత్తులకు ఉద్దేశపూర్వకంగా ధరలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కంది సాగు ఇలా (ఎకరాల్లో)

మండలం	సాగు చేసింది
ఇటిక్యాల	7,156
గద్వాల	5,616
వడ్డేపల్లి	5,258
అయిజ	4,934
మానవపాడు	4,808
ఉండవల్లి	3,672
ఎర్రవల్లి	2,240
మల్దకల్	2,183
రాజోళి	1,696
అలంపూర్	1,294
గట్టు	983
కేటీదొడ్డి	705
ధరూరు	690



యార్డులో కంది కాంట వేస్తున్న కార్మికులు

రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తాం



అలంపూర్‌లో రూ.50 కోట్ల లావాదేవీలు పూర్తి చేయడంతో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

అలంపూర్: డీసీసీబీ బ్యాంక్ ద్వారా రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అలంపూర్ పీఏసీఎస్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. మూడు సొసైటీలు కలిపి రూ.50 కోట్ల లావాదేవీలు పూర్తి చేసుకున్న సందర్భంలో నిర్వహించిన సమావేశానికి విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేయడంతోపాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న డీసీసీబీ బ్యాంక్ ద్వారా ఈ ఏడాది రూ. 1550 కోట్ల లావాదేవీలు జరిపిందని, గతేడాది రూ. 1200 కోట్లు అని వివరించారు. ఆరు నెలల్లోనే రూ. 350 కోట్ల లావాదేవీలు పెరిగిందన్నారు. 2024 డిసెంబర్ నుంచి జనవరి వరకు మూడు సొసైటీలు కలిపి రూ. 50 కోట్ల లావాదేవీలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది ఈ మూడు సొసైటీలు రూ. 38 కోట్ల లావాదేవీలు చేయగా ఆరు నెలల్లోనే రూ.12 కోట్ల పెంచినట్లు తెలిపారు. అలంపూర్ డీసీసీబీ బ్యాంక్‌లో మరో మూడేళ్లలో రూ.100 కోట్ల వరకు లావాదేవీలు జరిగే విధంగా చూస్తామన్నారు. 5 ఎకరాల పొలం ఉన్న రైతులకు కర్షకమిత్ర ద్వారా రూ.10 లక్షలు, మార్టిగేజ్ లేకుండా రైతులకు రూ. 2 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రైతులకు ఇంటి నిర్మాణం కోసం రూ. 25 లక్షలు, గ్రామాల పరిధిలో ఉన్న రైతులకు ఇంటి కోసం రూ.15 లక్షల వరకు రుణాలు ఇస్తుందన్నారు. అదేవిధంగా దేశంలో ఎక్కడైన చదువుకోవడానికి రైతు బిడ్డలకు రూ.10 లక్షలు, ఇతర దేశాల్లో విద్యను అభ్యసిస్తే రూ.35 లక్షల వరకు రుణ సౌకర్యం ఉందన్నారు. రైతులకు బంగారంపై 15 నిమిషాల్లో రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రూ.2 లక్షల రుణ మాఫీలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.29 కోట్లు వచ్చినట్లు తెలిపారు. జోగుళాంబ అమ్మవారి ఆశీస్సులు ఉండటంతో రైతులకు సేవ చేసే అవకాశం లభించిందని, డీసీసీబీ బ్యాంక్ ఆర్‌బీఐ మార్గదర్శకాలతో, రైతు పక్షపాతిగా డీసీసీబీ పనిచేస్తోందన్నారు. రైతులకు అన్ని విధాలుగా రుణాలు అందించేంది డీసీసీబీ బ్యాంక్ ఒక్కటే అని, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, డీసీసీబీ సీఈఓ పురుషోత్తం రావు, పీఏసీఎస్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, గజేందర్ రెడ్డి, రాఘవ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ రేణుకమ్మ, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

గద్వాలటౌన్ : 'చాయ్ తాగే సమయంలోపు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించొచ్చని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో స్పష్టమైన హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇపుడు ముఖ్యమంత్రిగా మాట నిలబెట్టుకోవాలని' అని పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు ఎంపీ డీకే అరుణతో పాటు వివిధ సంఘాల నాయకులు వేరువేరుగా సంపూర్ణ మద్దతును ప్రకటించారు. బుధవారం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్ని రోజులుగా ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కేజీబీవీలోని విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగికి జీవిత భీమా, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఎస్ఎస్ఏ ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు, ఎస్ఓలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై చర్య తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, క్రీడాకారులు

గద్వాల: గద్వాల పట్టణంలో విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రాజుల కాలం నాటి బావిని కబ్జాచేసి దానిని మట్టితో పూడ్చివేశాడు. అదేవిధంగా పాఠశాలకు చెందిన ఆటస్థలాన్ని కూడా కబ్జా చేశారన్నారు. గతంలో పాతబ స్టాండులో సైతం మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి ఇతరులకు విక్రయించారని, ఇలా చాలా చోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జాపెడుతూ దర్జాగా దోపిడీకి పాల్పడుతున్నా పాలకులు, అధికారులు కాని పట్టించుకోవడం లేదని, ఇప్పటికైన అధికారులు స్పందించి రాజుల కాలం నాటి పురాతన బావిని స్వాధీనం చేసుకుని కాపాడాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఆట స్థలానికి అనుకుని నిర్మాణం చేసిన ఫంక్షన్ హాలు నుంచి వ్యర్థపదార్థాలు, వాయుకాలుష్యం వలన క్రీడాకారులు, పక్కనే ఉన్న ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బస్సుమోహన్‌రావు, ప్రభాకర్, ఇక్బాల్‌పాషా, సుభాన్, నాగన్న, క్రీడాకారులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కిక్కు..!

న్యూ ఇయర్ వేడుకల్లో తెగ తాగేశారు

- నాలుగు రోజుల్లో రూ.54.46 కోట్ల మద్యం అమ్మకాలు
- ఉమ్మడి జిల్లాలో మద్యం ప్రియుల రికార్డు
- వ్యాపారులు, ఆబ్కారీశాఖకు కాసుల పంట
- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 207 మంది వాహనదారులు



గద్వాలలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

డిసెంబర్ 31వ తేదీన ఉమ్మడి జిల్లాలో డ్రంకెన్‌డ్రైవ్ కేసులు

మహబూబ్‌నగర్	93
వనపర్తి	55
జోగుళాంబ గద్వాల	31
నారాయణపేట	22
నాగర్‌కర్నూల్	6

మహబూబ్‌నగర్ క్రైం: మందుబాబులు.. తెగ తాగేశారు. ఎక్సైజ్‌శాఖకు మాంచి కిక్కిచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్త సంవత్సరం వేడుకల్లో మద్యాన్ని మంచినీళ్లలా తాగేశారు. మందుతో పాటు మాంసం, కేక్‌లు, బిర్యానీలు ఇలా అన్ని రకాల వ్యాపారం దాదాపు రూ.వంద కోట్ల వరకు జరిగింది. ప్రధానంగా డిసెంబర్ 28 నుంచి డిసెంబర్ 31 వరకు రూ.54.46 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో 69,457 కాటన్ల బీర్లు, 52,630 కాటన్ల ఐఎంఎల్ లిక్కర్ విక్రయాలున్నాయి. మందు బాబులు పెగ్గుమీద పెగ్గు లాగించి.. కిక్కులో మునిగి తేలారు. న్యూ ఇయర్ వేడుకలు ఉన్న నేపథ్యంలో వ్యాపారులు మద్యం డిపో నుంచి అధికంగా మందు తీసుకొచ్చి నిల్వ చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు దుకాణాలు, ఒంటి గంట వరకు బార్లు కొనసాగడంతో వ్యాపారులు, ఆబ్కారీశాఖకు కాసుల పంట పండింది. గతేడాది కంటే ఈసారి ఐఎంఎల్ 10 శాతం విక్రయాలు పెరగడంతో.. మద్యం ప్రియులు రికార్డు సృష్టించారు.

❒ పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్న నేపథ్యంలో బార్లు, మద్యం దుకాణాలు మద్యం ప్రియులతో కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అర్ధరాత్రి ఒంటి గంట వరకు బార్‌లకు అనుమతి ఉండటం వల్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో 90, నాగర్‌కర్నూల్ జిల్లాలో 67, వనపర్తిలో 37, గద్వాలలో 36 మద్యం దుకాణాలున్నాయి. కాగా.. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో ఉండగా.. జడ్చర్లలో రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత కల్వకుర్తి, వనపర్తి, నారాయణపేట, కొత్తకోట ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి.

నడిగడ్డలో రూ.3.10 కోట్ల మద్యం అమ్మకాలు

గద్వాల క్రైం: న్యూ ఇయర్ వేడుకలకు మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లాలోని మద్యం దుకాణాలు, రెస్టారెంట్‌ల వద్ద మద్యం ప్రియుల తాకిడికి మందు పెట్టెలు ఖాళీ అయ్యాయి. జిల్లాలో డిసెంబర్ 30, 31వ తేదీల్లో రూ. 3.10 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 20 శాతం అమ్మకాలు పెరిగాయన్నారు. ఎక్సైజ్‌శాఖకు భారీ మొత్తంలో ఆదాయం సమకూరిందన్నారు.

తాగేశారు.. చిక్కారు..

కొత్త సంవత్సరం వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షలు నిర్వహించి.. మోతాదుకు మించి మద్యం సేవించిన వాహనదారులను అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మందు తాగి వాహనాలు నడిపిన 207 మందిని అదుపులోకి తీసుకున్నారు. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 93 మంది పోలీసులకు చిక్కారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో చేసిన తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు 27, టూటౌన్ 8 మంది, జడ్చర్లలో 10, కోయిలకొండ 3, హన్వాడ 3, రాజాపూర్ 8, బాలానగర్ 12, మిడ్జిల్ 3, భూత్పూర్ 4, అడ్డాకుల 6, దేవరకద్ర 3, మహబూబ్‌నగర్ రూరల్, వన్‌టౌన్, మూసాపేట, నవాబ్‌పేట, మహమ్మదాబాద్, చిన్నచింతకుంట స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. వనపర్తి జిల్లాలోని పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 14, వనపర్తి టౌన్ 11, కొత్తకోట 7, వనపర్తి రూరల్ 5, గోపాల్‌పేట 4, పెద్దమందడి 4, ఆత్మకూర్ 3, అమరచింత 3, రేవల్లి 2, పాన్‌గల్, ఖిల్లాఘనపురంలో ఒక కేసు చొప్పున నమోదయ్యాయి. నారాయణపేట జిల్లాలో నారాయణపేటలో 6, దామరగిద్ద 2, ధన్వాడ 2, నర్వ 2, మక్తల్ 4, కృష్ణ 3, మాగనూర్, మరికల్, మద్దూరులో ఒక్కో కేసు నమోదయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్ స్టేషన్ పరిధిలో 3, చారకొండలో 2, వెల్దండలో ఒకటి చెప్పున, జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల పట్టణం 7, ఉండవెల్లి 8, ఇటిక్యాల 3, కొదండాపురం 2,శాంతినగర్ 6, అయిజ 3, అలంపూర్, రాజోళిలో ఒకటి చొప్పున డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3, చారకొండ మండలంలో 2, వెల్దండ మండలంలో ఒకరు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్త సంవత్సర వేళ ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అలంపూర్/మల్దకల్/ఎర్రవల్లి: నూతన సంవత్సరం వేళ జిల్లాలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయానికి వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే, అడిషనల్ కలెక్టర్ లక్ష్మి నారాయణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

❒ బీచుపల్లిలోని అభయాంజనేయస్వామి, కోదండ రామస్వామి, సరస్వతిదేవి, శివాలయాలకు భక్తులు క్యూ కట్టారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉదయాన్నే బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. ఆలయాల్లో అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు.

❒ దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను కర్నూల్ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కబర్ది బుధవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జోగుళాంబ ఆలయంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి


యాదమ్మ (ఫైల్)

మిడ్జిల్: విద్యుదాఘాతంతో గదిలో మంటలు చెలరేగి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు తెలిపారు. స్థానికులు, ఎస్‌ఐ కథనం మేరకు.. మిడ్జిల్‌కు చెందిన తుప్పుడ యాదమ్మ (55) మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత తన గదిలో నిద్రించింది. బుధవారం ఉదయం గదిలో నుంచి పొగలు రావడం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తలుపు తీసి చూడగా యాదమ్మ మృతిచెంది కనిపించింది. కుమారుడు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. యాదమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతదేహం గుర్తింపు


వ్యక్తి మృతదేహం

ఊర్కొండ: ఊర్కొండ శివారులో కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున అటుగా వెళ్తున్న వాహనదారులు మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. చలితో పాటు నీరసంగా ఉండటంతో చనిపోయి ఉంటాడని వైద్యులు పరీక్షించి తెలిపారన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చామని.. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఊర్కొండ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నాగర్‌కర్నూల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. పెద్దముద్దునూర్‌కు చెందిన లక్ష్మమ్మ (42) నడుచుకుంటూ వెళ్తుండగా.. కొల్లాపూర్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు లింగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏఆర్ ఏఎస్‌ఐకి గాయాలు

తిమ్మాజిపేట: మండల కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఏఎస్‌ఐకి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన గుణవర్ధన్ జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ ఏఎస్‌ఐగా పనిచేస్తున్నారు. బుధవారం గ్రామ సమీపంలోని తన పొలానికి బైక్‌పై వెళ్లి వస్తుండగా.. వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

దారి తప్పిన ‘భద్రత’

- నిర్లక్ష్యం మాటున నిండు ప్రాణాలు బలి
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- కనిపించని హైవే పెట్రోలింగ్ అధికారులు
- నేటి నుంచి 31వరకు జాతీయ రోడ్డుభద్రత వారోత్సవాలు


మహబూబ్‌నగర్ ఆర్టీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీటీసీ కిషన్

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో రోడ్డు ‘భద్రత’ దారి తప్పుతోంది. అతివేగం.. నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో అకాల మృత్యువాత పడుతున్నవారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందే ప్రతి పది మందిలో కచ్చితంగా ఆరుగురు యువకులే ఉంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

■ ఉమ్మడి జిల్లాలో కొత్తూర్ నుంచి అలంపూర్ చౌరస్తా వరకు 185 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారి ఉంది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్ల నిర్మాణంలో ప్రమాణాలు పాటించకపోవడం, భద్రతా చర్యలను గాలి కొదిలేయడంతో నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి.

నేటి నుంచి రోడ్డుభద్రత వారోత్సవాలు

ప్రమాదాలు తగ్గించడానికి నేటి (గురువారం) నుంచి జనవరి 31వరకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా రవాణా శాఖాధికారులు ప్రమాదాలకు గురవుతున్న వాహనాలను తనిఖీచేసేందుకు కార్యాచరణ రూపొందించారు. అవసరమైతే కేసులు నమోదుచేసి వాహనాలను సీజ్ చేయనున్నారు.



ఏడాది	రోడ్డు ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2023	230	244	463
2024	257	273	476

65 శాతం దాటుతున్న బాధితులు

అంగవైకల్యాలు, అనారోగ్యంతో జబ్బుల బారినపడుతున్న వారు, ముందస్తు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వీటిపై సర్వే నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిధులు సమకూర్చి 29రాష్ట్రాల్లో ఆయా అంశాలపై అధ్యయనం చేశారు. అంగవైకల్యం, ముందస్తు మరణాలు ఇతర వ్యాధులకు రోడ్డు ప్రమాద క్షతగాత్రుల వేదనలే కారణంగా నిర్ధారించాయి. గతంతో పోల్చితే క్షతగాత్రులు, అంగవైకల్యానికి గురయ్యే వారి సంఖ్య ప్రస్తుతం 65శాతానికి చేరుకుందని తేల్చాయి.

వేగాన్ని నియంత్రించలేక

ప్రస్తుతం మార్కెట్లోకి వేగం ఎక్కువగా ఉన్న వాహనాలు వస్తున్నాయి. వాహనం స్టార్ట్ చేసిన 5సెకన్ల లోపు వేగం అందుకుంటుంది. ఈ సమయంలో ఏదైన అడ్డుగా వస్తే వాహనాన్ని నియంత్రించ లేక పోవడంతో ప్రమాదానికి గురవుతున్నారు.

అత్యంత ప్రమాదకర ప్రాంతాలు

జిల్లాలో ఆర్టీఏ, పోలీస్ అధికారులు అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించారు. రాయికల్, బాలానగర్, బాలానగర్ బ్రిడ్జి దగ్గర, రాజాపూర్, ముద్దిరెడ్డిపల్లి, గొల్లపల్లి, కావేరమ్మపేట అర్అండ్‌బీ అతిథిగృహం, జడ్చర్ల, భూత్పూర్ మునిరంగస్వామి ఆలయం, బూరెడ్డిపల్లి, మల్లబోయినిపల్లి, దివిటిపల్లి, జానంపేట, వేముల, కందూర్, అడ్డాకల్ స్టేజీ దగ్గర నిత్యం ప్రమాదం జరుగుతున్నాయి.

నివారణ చర్యలు శూన్యం

రోడ్డు ప్రమాదాల వారోత్సవాలు జరిగినప్పుడు మాత్రమే తూతుమంత్రంగా వ్యవహరించి ఆపూట గడిచే వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు శూన్యం. హైవేపై ఎక్కడా కూడా సరైన ప్రమాదసూచికలు లేవు.

వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

■ మద్యం తాగి వాహనాలను నడపరాదు. పరిమితికి మించిన బరువు, అతివేగంతో వాహనాలు డ్రైవ్ చేయరాదు. వాహనాలను నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో కానీ, పక్కసీటులో ఉన్నవారితో మాట్లాడటం సరైన విషయం కాదు. పొగమంచు, దుమ్ము లేచినప్పుడు చీకటి ప్రాంతాల్లో వాహనాలను నెమ్మదిగా నడపాలి. ఓవర్‌టేక్ చేయవద్దు. ఎదురుగా వచ్చే వాహనదారులను అయోమయానికి గురిచేసేలా డ్రైవింగ్ ఉండరాదు. బైక్ నడిపేవారు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్టు ధరించాలి.

రోడ్లకిరువైపులా భారీ వాహనాలు

జిల్లాలోని ముఖ్యంగా అన్ని ప్రధాన రోడ్లకిరువైపులా దాబాల ముందు లెక్కకు మించి భారీ వాహనాలు, కార్లు, బైక్‌లను నిలుపుతున్నారు. రోడ్డుపై వెళ్లేవారికి ఇబ్బందులు తలెత్తి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. 24గంటలు పర్యవేక్షించాల్సిన (హైవే పెట్రోలింగ్) అధికారులు కనిపించడం లేదు. దీంతో డ్రైవర్లకు నచ్చినచోట వాహనాలను నిలుపుతున్నారు.

స్పీడ్ గన్స్ ఏవీ..?

వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానా వేసేందుకు వీలుగా స్పీడ్ గన్స్‌ను ప్రవేశపెట్టారు. గంటకు 240 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న వాహనాన్ని దీంతో గుర్తించొచ్చు. వేగంగా వచ్చే వాహనాలను 100 మీటర్లలోకి వచ్చాక స్పీడ్‌గన్‌లో ఆపరేటర్ చూస్తే వాహనం నంబర్, ఫొటో, వేగం నమోదవుతోంది. కానీ ప్రధాన జాతీయ రహదారిపై వీటిని ఏర్పాటుచేయలేదు.

అవగాహన కల్పిస్తాం

ఆర్టీఏ కార్యాలయానికి లైసెన్స్ కోసం వచ్చే ప్రతి ఒక్కరికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగిస్తాం. ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా లేదా అనేది చూసుకోవాలి. ఈనెల రోజుల పాటు ఆటో, ఆర్టీసీ, అన్ని వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం. ఏకాగ్రతతో వాహనాలను నడిపితే ప్రమాదాలను తగ్గించొచ్చు. వాహనదారులకు లైసెన్స్‌లు, ఇతర పత్రాలుంటేనే రహదారిపై అనుమతి ఇస్తాం. –కిషన్, డీటీసీ మహబూబ్‌నగర్

ఆలిండియా యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు అద్నానుద్దీన్


ఎండీ అద్నానుద్దీన్

మహబూబ్‌నగర్ క్రీడలు: మద్రాస్ యూనివర్సిటీలో ఈనెల రెండో వారంలో జరిగే సౌత్‌జోన్ ఆలిండియా యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎండి.అద్నానుద్దీన్ ఎంపికయ్యారు. ఎడమచేతి బ్యాట్స్‌మెన్ అయిన అద్నాన్ క్రికెట్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. బౌలింగ్‌లో, బ్యాటింగ్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. ఇటీవలే జరిగిన పాలమూరు యూనివర్సిటీ క్రికెట్ ఎంపికల్లో అద్నానుద్దీన్ ప్రతిభచాటి ఆలిండియా పోటీలకు ఎంపికయ్యాడు. అద్నానుద్దీన్ గతంలో జాతీయ, రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటాడు. పలుసార్లు హెచ్‌సీఏ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. గత ఏడాది నేపాల్‌లో జరిగిన ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో పాల్గొన్నాడు. 2017–18లో మహారాష్ట్ర నాసిక్‌లో జరిగిన అండర్–14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, 2019–20లో మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్–19 ఎస్‌జీఎఫ్‌ఐ క్రికెట్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ నుంచి 550 క్యూసెక్కుల వరద వస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. అలాగే జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 180 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 85 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు చెప్పారు.

ఆధ్యాత్మిక వెల్లువ


మన్యంకొండలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ప్రధాన ఆలయాలు

అలంపూర్: నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం అలంపూర్ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేక పూజలు.. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో దర్శనానికి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. భక్తులు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చారు. ఆలయాల సముదాయంలోని పార్కింగ్ స్థలాల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ప్రధాన రోడ్డుపై వాహనాలు అధికంగా రావడంతో పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. గద్వాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వనపర్తి తదితర ప్రాంతాల భక్తులు అలంపూర్ చౌరస్తా వరకు బస్సుల్లో చేరుకొని ఇక్కడి నుంచి ప్రైవేటు వాహనాల్లో ఆలయాలకు తరలివచ్చారు.

మన్యంకొండలో భక్తుల రద్దీ..

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం బుధవారం భక్తజన సందోహంతో పులకించిపోయింది. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 7 నుంచే ప్రధాన ముఖద్వారం నుంచి గర్భాలయం వరకు భక్తులు బారులు తీరారు. ప్రధాన ఆలయం, పక్కనున్న శివాలయం, కొండ దిగువనున్న అలివేలు మంగతాయారు దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు సౌకర్యాలు కల్పించారు.


అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు


బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజలు

■ వేప చెట్టు నుంచి కల్లు



ఈత, తాటి చెట్ల నుంచి కల్లు కారడం సర్వసాధారణం. కాని ఇటిక్యాల మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న వేప చెట్టు నుంచి కొన్ని రోజులుగా కల్లు కారుతోంది. గత రెండేళ్లుగా డిసెంబర్, జనవరి నెలల్లో కల్లు కారుతున్నట్లు స్థానికులు తెలిపారు. రోజు రెండు నుంచి మూడు లీటర్ల కల్లు కారుతుండటంతో ప్రత్యేకంగా డబ్బాను ఏర్పాటు చేశారు. వేప చెట్టుకు కల్లు కారుతున్న విషయాన్ని తెలుసుకున్న ప్రజలు అక్కడికి చేరుకుని వింతగా చూస్తున్నారు. – ఎర్రవల్లి

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నారాయణపేట టౌన్: ఐదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన ఓయువకుడిపై పోక్సో కేసు నమోదైన సంఘటన బుధవారం నారాయణపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. స్థానిక హజీఖాన్‌పేటలోని కుర్వగేరిలో ఆచిన్నారి కుటుంబం అద్దెకు ఉంటుంది. ఆఇంటి యజమాని అయిన యువకుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. చిన్నారిపై కన్నేసిన అతడు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆపాప కేకలు వేయడంతో కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లి చూశారు. అతడు చేసిన పనిని చూసి చిన్నారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. బాధిత కుటుంబం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అఘాయిత్యానికి యత్నించిన యువకుడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. అతడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోరాహోరీగా నెట్‌బాల్ చాంపియన్‌షిప్


పురుషుల విభాగంలో తలపడుతున్న మహబూబ్‌నగర్–హన్మకొండ జట్లు


మహబూబ్‌నగర్–హన్మకొండ మ్యాచ్‌ను టాస్‌వేసి ప్రారంభిస్తున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ కొత్వాల్

- దూసుకెళ్తున్న మహబూబ్‌నగర్ జట్లు
- ప్రీక్వార్టర్‌కు చేరిన జట్లు
- నేటితో ముగియనున్న పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో ఆతిథ్య మహబూబ్‌నగర్ పురుషుల, మహిళా జట్లు దూసుకెళ్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన నాగర్‌కర్నూల్, గద్వాల జట్లు సత్తాచాటుతున్నాయి. రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు నేడు (గురువారం) ముగియనున్నాయి.

ప్రీక్వార్టర్‌కు చేరిన జట్లు

నెట్‌బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రీక్వార్టర్ ఫైనల్‌కు మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నల్లగొండ, హైదరాబాద్, ఖమ్మం, మేడ్చల్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, కామారెడ్డి, జనగాం, వరంగల్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, కరీంనగర్ జట్లు చేరాయి. మహిళల విభాగంలో మహబూబ్‌నగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్, ఆసిఫాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, కరీంనగర్, గద్వాల, మెదక్, వరంగల్, వనపర్తి, జనగాం, నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ జట్లు.

పురుషుల విభాగం మ్యాచ్‌ల ఫలితాలు

పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 21–4 పాయింట్ల తేడాతో హన్మకొండ జట్టుపై, ఖమ్మం జట్టు 35–1 తేడాతో పెద్దపల్లి జట్టుపై, కామారెడ్డి జట్టు 17–14 తేడాతో మెదక్ జట్టుపై, నిజామాబాద్ జట్టు 21–10 తేడాతో ఆసిఫాబాద్ జట్టుపై, వరంగల్ జట్టు 13–5 తేడాతో నిర్మల్ జట్టుపై, రాజన్న సిరిసిల్ల జట్టు 5–4 తేడాతో మంచిర్యాలపై, నల్లగొండ జట్టు 15–9 తేడాతో వనపర్తి జట్టుపై, కరీంనగర్ జట్టు 23–12 తేడాతో గద్వాల జట్టుపై, ఆదిలాబాద్ జట్టు 13–2 తేడాతో పెద్దపల్లి జట్టుపై, మేడ్చల్ జట్టు 29–9 తేడాతో మెదక్ జట్టుపై, నిజామాబాద్ జట్టు 13–9 తేడాతో జనగాం జట్టుపై, నాగర్‌కర్నూల్ జట్టు 32–1 తేడాతో నిర్మల్ జట్టుపై, నారాయణపేట జట్టు 21–2 తేడాతో రాజన్నసిరిసిల్ల జట్టుపై, భద్రాద్రి కొత్తగూడెం జట్టు 12–3 తేడాతో మంచిర్యాల జట్టుపై, మహబూబాబాద్ జట్టు 28–4 తేడాతో సంగారెడ్డిపై, మహబూబ్‌నగర్ జట్టు 15–7 తేడాతో రంగారెడ్డిపై, రంగారెడ్డి జట్టు11–7 తేడాతో హన్మకొండ జట్లపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

మహిళా విభాగం మ్యాచ్‌ల ఫలితాలు

మహిళల లీగ్ మ్యాచ్‌ల్లో మహబూబ్‌నగర్ జట్టు 19–3 తేడాతో మంచిర్యాలపై, ఖమ్మం 25–1 తేడాతో నాగర్‌కర్నూల్ పై, నిర్మల్ జట్టు 15–1 తేడాతో ఆసిఫాబాద్‌పై, నల్లగొండ 24–2 తేడాతో వరంగల్ జట్టుపై, కరీంనగర్ జట్టు 8–3 తేడాతో వనపర్తి జట్టుపై, జనగాం జట్టు 21–3 తేడాతో మంచిర్యాలపై, నిజామాబాద్14–3 తేడాతో నారాయణపేటపై, మెదక్ 15–8 తేడాతో మహబూబాబాద్‌పై, ఖమ్మం 30–4 తేడాతో నారాయణపేటపై, రంగారెడ్డి 18–8 తేడాతో మహబూబాబాద్‌పై, రంగారెడ్డి జట్టు 19–6 తేడాతో మెదక్‌పై గెలుపొందాయి.

మ్యాచ్‌లను ప్రారంభించిన ఒబేదుల్లా కొత్వాల్

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహబూబ్‌నగర్–హన్మకొండ పురుషుల మ్యాచ్‌ను ఆయన టాస్‌వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ.వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్య రెడ్డి, ఖాజాఖాన్, జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాల్‌రాజు, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, డీఎస్‌ఏ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం కప్ నెట్‌బాల్ టోర్నీలో గందరగోళం

- రంగారెడ్డి జిల్లా నుంచి రెండు పురుషుల, రెండు మహిళా జట్ల హాజరు
- ఎంట్రీ ఫారాలు ఉన్న జట్లనే ఆడిస్తామన్న నిర్వాహకులు
- క్రీడా కోర్టులో నిరసనకు దిగిన మిగతా జట్ల క్రీడాకారులు
- ఇరు జట్లకు అవకాశం ఇవ్వడంతో సద్దుమణిగిన వివాదం


నిరసనకు దిగిన రంగారెడ్డి పురుష, మహిళా జట్లతో మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ టోర్నీలో బుధవారం కొంత గందరగోళం నెలకొంది. టోర్నీకి ఒక్కో జిల్లా ఒక పురుషుల, ఒక మహిళా జట్లు రావాల్సి ఉండగా.. రంగారెడ్డి జిల్లా నుంచి మాత్రం రెండు పురుషుల, రెండు మహిళా జట్లు వచ్చాయి. వీటిలో ఒక పురుష, ఒక మహిళా జట్లకు డీవైఎస్‌ఓ సంతకంతో కూడిన ఎంట్రీ ఫాంలు ఉన్నాయి. మిగతా జట్లకు లేవు. అయితే ఎంట్రీ ఫాంలు ఉన్న టీంలనే ఆడిపిస్తామని మొదట్లో నిర్వాహకులు చెప్పడంతో వివాదానికి దారితీసింది.

క్రీడా కోర్టులో నిరసన..

డీవైఎస్‌ఓ ఎంట్రీ ఫాంలు లేని జట్ల క్రీడాకారులు క్రీడా కోర్టులో బైఠాయించి ఆందోళనకు దిగారు. దాదాపు గంటసేపు క్రీడా కోర్టులో బైఠాయించడంతో ఇతర మ్యాచ్‌లకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ తమ జట్లకు మంగళవారమే మ్యాచ్‌లు ఉండగా నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జట్లు రంగారెడ్డి జిల్లాస్థాయిలో గెలుపొందాయని.. మెడల్స్, సర్టిఫికెట్లు ఇచ్చారని తెలిపారు. అయితే తమ జట్లను ఎందుకు ఆడించడం లేదని ప్రశ్నించారు. తాము జిల్లాస్థాయిలో గెలిచినా ఎంట్రీఫాం ఇవ్వలేదని ఆరోపించారు. రంగారెడ్డి పేరుతో ఉన్న ఇతర జట్లలో మేడ్చల్ క్రీడాకారులు ఉన్నారని.. వారికి అవకాశం ఇవ్వకుండా తమ జట్లను టోర్నీలో ఆడించాలని నిరసన తెలిపారు. అనంతరం డీవైఎస్‌ఓ ఇరు జట్ల కోచ్‌లు, క్రీడాకారులతో మాట్లాడి నిరసనకు దిగిన జట్లకు మ్యాచ్‌లు ఆడిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం నెట్‌బాల్ మ్యాచ్‌లు యథావిధిగా కొనసాగాయి. ఈ విషయమై డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. రంగారెడ్డి జిల్లా నుంచి ఒక పురుషుల, ఒక మహిళా జట్లు రావాల్సి ఉండగా.. అదనంగా రెండు జట్లు వచ్చాయన్నారు. రంగారెడ్డి డీవైఎస్‌ఓ, శాట్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా జట్లను ఒప్పించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

గొలుసు అపహరణ.. కేసు నమోదు

గద్వాల క్రైం: దేవాలయంలో నిద్రిస్తున్న వ్యక్తి మెడలో గొలుసు అపహరించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పీజేపీ క్యాంప్‌లోని వేంకటేశ్వర దేవాలయంలో మంగళవారం రాత్రి రాఘవేంద్ర (అయ్యప్ప మాల ధారణ) వ్యక్తి నిద్రపోతుండగా గుర్తు తెలియని వ్యక్తి అతని మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసు అపహరించాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ద్వారా నిందితుడుని గుర్తించారు. బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరం అంగీకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు పట్టణానికి చెందిన మణికంఠగా పేర్కొన్నారు.